స్విమ్మింగ్ పూల్‌కు రాజకీయ గ్రహణం

- రూ.2.5 కోట్లతో స్త్రీ, పురుషులకు ప్రత్యేకంగా నిర్మించిన ఈత కొలనులు
- అధికారుల నిర్లక్ష్యంతో మూతపడిన వైనం
- వైఎస్సార్‌సీపీకి పేరు వస్తుందనే దురుద్దేశంతోనే మూయించిన అధికార పార్టీ నాయకులు
- పంత పాడుతున్న మున్సిపల్ అధికారులు



మూతపడిన ఈతకొలను



బోసిపోయిన మహిళల ఈతకొలను

డోన్: ఈత సరదా కాదు, సమస్త శరీర అవయవాలను కదిలించదే అత్యుత్తమ వ్యాయామం. పూర్వం వంకలు, వాగులు, దిగుడు, చేదర బావుల్లో పెద్దలు తమ పిల్లలకు ఈత నేర్పించేవారు. రానురాను అవి కనుమరుగు కావడంతో ఈత కొలనులకు ప్రాధాన్యత ఏర్పడింది. నడక, పరుగు, యోగాసనాల వల్లే ఈత కూడా మానవ సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వైద్యనిపుణుల అభిప్రాయం. ఈ స్విమ్మింగ్‌పూల్ మూతపడటం వల్ల పలువురు యువకులు ఈ వేసవికాలంలో ఈత కోసం దిగుడుబావులకు వెళ్లి మృత్యువాతపడుతున్నారు. మరికొందరు ప్రైవేటు స్విమ్మింగ్ పూల్‌ను ఆశ్రయించి ఈత నేర్చుకుంటున్నారు.

మాజీ ఆర్థిక మంత్రి చొరవతో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ నడిబొడ్డున డాక్టర్ రామసుబ్బయ్య లేఅవుట్‌లో మున్సిపాలిటీకి అప్పగించిన స్థలంలో రూ.2.5 కోట్లతో రెండు స్విమ్మింగ్ పూళ్లను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు ఎంతో సందడిగా కనిపించిన ఈతకొలనులు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మున్సిపల్ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం మూలంగా నిరుపయోగంగా మారాయి. తద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైంది.

అర్థం కావడం లేదు



కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన మహిళలు, పురుషుల ఈత కొలనులు అధికారుల అలసత్వం మూలంగా నిరుపయోగంగా మారాయి. అధికారుల వైఖరి ఎవరికీ అర్థం కావడం లేదు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈత కొలనులను పాడుపడేట్లు చేసి అప్రతిష్టపాలు చేయాలనే దురుద్దేశం కూటమి ప్రభుత్వం నాయకుల్లో కనిపిస్తున్నట్లు ఉంది.

– వెంకటేశ్వరమ్మ, మున్సిపల్ కౌన్సిలర్, డోన్

అధికారుల ఏకపక్ష నిర్ణయాలు



మున్సిపల్ అధికారుల ఏకపక్ష నిర్ణయాల వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన క్లబ్ హౌస్, ఆధునిక కూరగాయల మార్కెట్ పై అంతస్తు గదులు, స్విమ్మింగ్ పూల్స్ నిరుపయోగంగా మారాయి. అధికార పార్టీ నాయకుల మాటలకు తలొగ్గి ఎంతో సుందరంగా నిర్మించిన వీటిని మరుగున పడేలా చేయాలనే కుట్ర జరుగుతుందని భావిస్తున్నాం.

నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్, డోన్

కోర్టు సాకుతో తప్పదారి



గత ఏడాది వరకు సందర్శకులతో ఎంతో సందడిగా కనిపించిన ఈతకొలనులు మూత పడటం దురదృష్టకరం. ఈ వ్యవహారం కోర్టులో ఉన్నందువల్ల స్విమ్మింగ్ పూల్ మూత పడిందని అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. 13 సెంట్ల అదనపు స్థలాన్ని మున్సిపాలిటీ ఆక్రమించిందని మాత్రమే డాక్టర్ రామసుబ్బయ్య కుటుంబ సభ్యులు కోర్టుకు వెళ్లారు తప్ప ఈతకొలను నిర్వహణపై కాదు.

– సప్తశైల రాజేష్, మున్సిపల్ చైర్మన్, డోన్

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి అనంతపురం వాస్తవ్యులు కె.హనుమంతరెడ్డి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. దాత కుటుంబ సభ్యులను సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఆలయ అర్చకులు,వేదపండితులు ఉన్నారు.

సివిల్ సప్లయి స్టాక్ పాయింట్ తనిఖీ



గోడౌన్‌లో స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న జోనల్ మేనేజర్ వెంకటరాముడు

బనగానపల్లె రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగానున్న సివిల్ సప్లయి గోడౌన్‌లో నిల్వ ఉన్న స్టాక్‌ను జోనల్ మేనేజర్ వెంకటరాముడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో ఎంత మేర బియ్యం,చక్కెర,జొన్నలు, కందిపప్పు, పామయిల్ నిల్వలు ఉన్నాయి, డీలర్లకు,అంగన్‌వాడీ సెంటర్లు, వసతి గృహాలకు సరఫరా చేసిన స్టాక్ రికార్డులను పరిశీలించారు. గౌడౌన్ ఇన్‌చార్జ్ బాలీశ్వరయ్య, సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా



బెకరీ యజమానికి జరిమానా విధిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న గోల్డెన్ బేకరీ అండ్ స్వీట్స్ షాపులో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నట్లు సమాచారం రావడంతో గ్రామ పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం షాపులో తనిఖీలు చేపట్టారు. ప్లాస్టిక్ కవర్లు లభించడంతో షాపు యజమానికి రూ.5వేల జరిమానా విధించారు. బనగానపల్లెలో ప్లాస్టిక్ కవర్ల వాడకం పూర్తిగా నిషేధించామని, నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీడీపీఓ శంషాద్ బేగం

బేతంచెర్ల: పద్దెనిమిదేళ్లు నిండకుండానే బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని డోన్ ఐసీడీఎస్ సీడీపీఓ శంశాద్‌బేగం, బాలల సంరక్షణ విభాగం జిల్లా అధికారులు శ్రీనివాసులు, దర్గయ్య అన్నారు. మండల పరిధిలోని ఎంబాయి, సీతారామపురం గ్రామంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లయితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100, ఉమన్ హెల్ప్‌లైన్ 181 నంబర్లకు కాల్ చేయాలన్నారు.

గ్రామ దేవతలకు పూజలు



సుంకులమ్మకు పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని మండ్లవానిపల్లె గ్రామంలో నూతనంగా సుంకులమ్మ, జమ్ములమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట జరిగి 41 రోజులు పూర్తికావడంతో మంగళవారం సుంకులమ్మ, జమ్ములమ్మలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహికంగా బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. పూజల్లో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, పట్టణ కన్వీనర్ జాకీర్, ఎంబాయి సర్పంచ్ యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్యాపిలి: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్ వైద్యులు హాజరై షుగర్, బీపీ, 2డీ ఎకో, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తారన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం



బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామంలో వెలసిన చెన్న కేశవస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్న కేశవస్వామిని గ్రామ పురవీధుల గుండా గోవిందనామస్మరణల మధ్య రథోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంపై స్వామి, అమ్మవార్లను కొలువుంచి ఊరేగింపు చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నగర పంచాయతీ కార్మికులు

బేతంచెర్ల: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులోభాగంగా మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరిప్రసాద్‌కు కార్మికులు సమ్మె నోటీస్ ఇచ్చారు.

●కుంట కాదు.. రోడ్డే!



ప్రధాన రహదారిపై భారీగా నిలిచిన వర్షపునీరు

కొలిమిగుండ్ల: వర్షం కురిస్తే చాలు స్థానిక ప్రధాన రహదారి కుంటను తలపిస్తుంది. స్టేట్ బ్యాంక్ ఎదురుగా నీళ్లు నిల్వ చేరడంతో వాహనదారులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్డు పైనే నిలచిపోతున్నాయి. రోడ్డు తెలియక ద్విచక్ర వాహనదారులు నీళ్లలో కింద పడిపోతున్నారు. ఇటీవల రోడ్డుపై తారుతో ప్యా చింగ్ పనులు చేశారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. అధికారులు చర్యలు తీసుకొని రోడ్డుపై వర్షపునీటిని

డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్యాపిలి: డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అన్వర్ బాషా, రాయలసీమ ఇంచార్జి రామకృష్ణ యాదవ్ అన్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి డ్రైవర్లకు అవసరమైన వనరులను సమకూర్చాలన్నారు. ప్రమాదంలో డ్రైవర్ మరణిస్తే బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఆర్థిక సాయం అందజేయాలన్నారు. పుణ్యక్షేత్రాలు, పట్టణాలు, నగరాల్లో డ్రైవర్ల కోసం ప్రభుత్వం విశ్రాంతి భవనాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా సెక్రటరీ బాషా, గుత్తి, ప్యాపిలి అధ్యక్షులు కిశోర్ కుమార్, వెంకటేశ్, రమేశ్, మద్దిలేటి పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి



కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఆర్ఐ ప్రవీణ్‌నాయక్

బనగానపల్లె రూరల్ : పట్టణానికి చెందిన వీఆర్ఏ మస్తాన్‌వలి (58) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. అనారోగ్య సమస్యలతో కర్నూలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అయితే చికిత్స నుంచి కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ ప్రవీణ్‌నాయక్, సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ.25వేలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రూ.5వేలు అందజేశారు.సీనియర్ అసిస్టెంట్ శేషాద్రి, సంఘం నాయకులు గోపాలుడు, చెన్నప్ప, మల్లేశ్వరుడు, సుధాకర్,మధుప్రసాద్, వీఆర్‌ఓలు సురేంద్ర, ప్రసాద్,ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో మోస్తరు వర్షం



పొలంలో చేరిన వర్షపునీరు

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండి సాయంత్రానికి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు వేడి తీవ్రత నుంచి ఉపశమనం పొందారు. ఆయా మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరి కోత, నూర్పిడి చేసి ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసుకున్నారు. వడ్లతో పాటు మిరప కాయలు తడవకుండా రైతులు పట్టాలు కప్పుకునేందుకు అవస్థలు పడ్డారు.

కొలిమిగుండ్లలో 31.2 మి.మీ వర్షపాతం నమోదు

కొలిమిగుండ్ల: వాతావరణంలో ఒక్క సారిగా మార్పులు చోటు చేసుకొని మంగళవారం తెల్లవారుజామున కొలిమిగుండ్లలో ఉరుములు,మెరుపులతో వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం 31.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొలిమిగుండ్ల,బెలుం తదితర గ్రామాల్లో వర్షం కురవగా మిగిలిన గ్రామాల్లో వరుణుడి జాడ లేదు. పెద్ద శబ్దాలతో ఉరుములు,మెరుపులు రావడంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. బెలుం గుహల సమీపంలోని కుంటకు వర్షపునీరు చేరడంతో నిండిపోయింది. పాలాల్లో వర్షపునీరు చేరాయి.

సబ్సిడీతో పశువుల దాణా

బేతంచెర్ల: పాడి పశువులకు 50 శాతం సబ్సిడీతో సమీకృత దాణాను పంపిణీ చేస్తున్నట్లు వెటర్నరీ ఏడీ వసంతలక్ష్మి రైతులకు సూచించారు. బేతంచెర్లకు 60, ముద్దవరం 60, రంగాపురం 50, సీతారామాపురం 50 బ్యాగుల సమీకృత దాణా మంజూరైనట్లు తెలిపారు. 50 కేజీల బస్తా ధర రూ.1,100 కాగా 50 శాతం సబ్సిడీ పోనూ రూ.555 చెల్లించాలన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



చంద్రమౌళీశ్వర రెడ్డి

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని జ్యోతి విద్యానికేతన్ విద్యార్థులు మంగళవారం విడుదలైన సీబీఎస్ఈ (సెంట్రల్‌బోర్డ్‌ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) ఫలితాల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ సింధూరి తెలిపారు. పాఠశాలకు చెందిన వై. చంద్రమౌళీశ్వరరెడ్డి 500 మార్కులకు 489 మార్కులు సాధించాడన్నారు. అలాగే మంజునాథరెడ్డి 488 మార్కులు, హర్షిత్‌రెడ్డి 486, చరణ్‌రెడ్డి, షణ్ముఖరెడ్డి 484, గురువరణ్‌రెడ్డి 482 మార్కులు సాధించారని వివరించారు.

శుభకార్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన సోమన్నగారి శివరామిరెడ్డి కూతురు స్పందన వివాహ ముహూర్తం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో వధువును కాటసాని ఆశీర్వాదించారు. వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లెల్ల శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కోటపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మూల ఈశ్వరరెడ్డి కుమార్తె వివాహ ముహూర్త కార్యక్రమానికి పలువురు నాయకులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, నాయకులు గుండం సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో వార్డు సభ్యుడి మృతి

కొలిమిగుండ్ల: మండలంలోని మీర్జాపురం గ్రామానికి చెందిన మూడవ వార్డు మెంబర్ మార్కె దస్తగిరి (50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, సర్పంచ్ లాయర్ మహేశ్వరరెడ్డి దస్తగిరి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్లకు చెందిన ఓ వ్యక్తి మంగళవారం రాత్రి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలకు మేరకు..గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. కాగా ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ సంఘటన పై రేవనూరు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

బాధ్యతల స్వీకరణ

ప్యాపిలి: ప్యాపిలి, జలదుర్గం పీహెచ్‌సీలలో మంగళవారం వైద్యాధికారులు బాధ్యతలు స్వీకరించారు. ప్యాపిలి పీహెచ్‌సీలో గతంలో పనిచేస్తున్న నితీశ్ కుమార్, జలదుర్గంలో పనిచేస్తున్న నుస్రత్ ఉజొహరా ఉన్నత చదువుల నిమిత్తం సెలవుల్లో వెళ్లారు. వారి స్థానంలో ప్యాపిలి పీహెచ్‌సీకి రాహుల్, జలదుర్గం పీహెచ్‌సీకి హరిత నియమితులయ్యారు. ఈ మేరకు వారు విధుల్లో చేరినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

17న రాతిదూలం లాగుడు పోటీలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17వ తేదీన ఉభయ రాష్ట్రాల స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నాలుగు పండ్లలోపు విభాగంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం ఆవరణలో జరుగుతాయన్నారు. విజేతలకు వరుసగా.. రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5వేలు ప్రదానం చేస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు ఆలయ కమిటీని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

బేతంచెర్ల: భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ కిరణ్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కొమ్మూరి కొట్టాల గ్రామ పొలాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ భారతి ఆధ్వర్యంలో రైతులతో కలిసి భూసార పరీక్షలు నిర్వహించారు. భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాల ఆధారంగా భూమికి ఎరువులు, పంటలు వేసుకోవాలని సూచించారు.